క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



90వ వార్డు గొల్లవీధిలో అమ్మవారి విగ్రహం ముందు నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు గొల్లవీధి యంగ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధన చేశారు. యూత్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు చుక్కా ప్రసాద్ రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. సుమారు 3,500 మందికి అన్నప్రసాదాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యంగ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం మెయిన్ రోడ్ నుంచి గవర వీధి రామాలయం వరకు రూ.19.50 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. వార్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకట లక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, నరవ పైడిరాజు, పసాద్ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు



సభ్యత్వం అందిస్తున్న కాశీ విశ్వనాథరాజు

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సెల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ రాజు సూచించారు. పార్టీ నియోజక వర్గ కన్వీనర్ దాడి రమేష్ పర్యవేక్షణలో గోపాలపట్నం మండలంలో సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ రాజు మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు ఈ నెల 15 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ప్రతీ కార్యకర్త ప్రజల వద్దకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై వివరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గొర్ల అప్పలరాజు, మాధవిలత, పోలిమేర శ్రీనివాసరావు, జ్యోతి, సంతోష్ కుమార్, కామేష్ పాల్గొన్నారు.

త్వరగా ప్రజా సమస్యల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నలుగురు వినతులు అందించారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 02 వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మత్స్యరాజు, టీపీవో విజయకుమార్, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దనరావు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, మంచినీటి విభాగం ఏఈ మోహన్ పాల్గొన్నారు.

నత్తే నయం..!



పిల్లలు ఊగే బల్లను నిరుపయోగంగా పడేసిన దృశ్యం

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- పార్కుల సుందరీకరణపై అలసత్వం
- డిప్యూటీ మేయర్ శ్రీధర్ హెచ్చరిస్తున్నా అంతులేని నిర్లక్ష్యం
- కరాస పార్కులో అస్తవ్యస్తంగా పనులు

విశాఖ విద్య: కాలనీల్లో మౌలిక వసతులు పెంపొందించేందుకని చేపడుతున్న అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు, మూడడుగులు వెనక్కి అన్న చందాన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంబంధిత శాఖల అధికారులు అంతులేని నిర్లక్ష్యం వహిస్తున్నారు. జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయిస్తున్నారు. కానీ ఆ నిధులతో చేపడుతున్న పనులు మాత్రం సకాలంలో పూర్తికావడం లేదు. కాలనీల్లో పర్యావరణ హితం కోరుతూ, పార్కుల సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయిస్తున్నా సకాలంలో పనులు పూర్తి కావడం లేదు. వార్డు పరిధిలోని ఓల్డ్ కరాస పార్కులో చేపట్టిన పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పరిసర కాలనీల ప్రజానీకానికి ఎంతో సౌలభ్యంగా ఉండేలా అవసరమైన మేర పనులు చేపట్టేలా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎప్పటికప్పుడు అధికారులను వెంట తీసుకొని, క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మందకొడిగా...

గతంలో వేగంగా జరిగిన పనులు ప్రస్తుతం మందకొండిగా సాగుతున్నాయి. కరాస పార్కులో గతంలోనే విద్యుత్ కాంతులీనేలా లైట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పిల్లలు, పెద్దలు అందరికీ ఉపయోగపడేలా వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ మరో రూ.15 లక్షలతో అదనపు సౌకర్యాల కల్పన పేరిట పనులు చేస్తున్నారు. పిల్లలు జారుడు బల్ల వద్ద గతంలో ఇసుక ఉండగా, వారికి మరింత సౌకర్యవంతంగా ఉండేలా రబ్బరు మ్యాట్ అమర్చేందుకు వీలుగా ప్రస్తుతం సిమెంట్ కాంక్రీట్ వేశారు. ఇదిలా ఉంటే వ్యాయామ పరికరాల వద్ద ఫ్లోరింగ్ అమరిక సవ్యంగా లేదు. పిల్లలు ఓ పక్క ఆడుతుండగా, అదే సమయంలో పనులు చేస్తున్నారు. వాస్తవంగా ఇప్పటికే పార్కు అభివృద్ధి పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్ తీవ్ర తాత్సారం చేసినట్లు తెలుస్తోంది. చేస్తున్న పనులను కూడా ఇంజినీరింగ్ అధికారులు సవ్యంగా పర్యవేక్షించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తే, సకాలంలో పూర్తి చేయకుండా, ఇలా తాత్సారం చేయటమేంటని కాలనీల నివాసులు అంటున్నారు.



జీవీఎంసీ 52వ వార్డులోని ఓల్డ్ కరాస పార్కు



ఎండిన చెట్టు మొదలు తీయకుండానే వేసిన నాపరాళ్లు



పిల్లలు ఆడుకునే చోట వేస్తున్న రాళ్లు



జారుడు బల్ల వద్ద వేసిన కాంక్రీట్

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం

కరాస పార్కులో అదనపు సౌకర్యాల కల్పనకు ప్రస్తుతం పనులు చేస్తున్నాం. కాంట్రాక్టర్ వల్లనే కొంత ఆలస్యమైంది. దీనిపై సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వడంతో ప్రస్తుతం పనులు మొదలుపెట్టారు. వీటిని సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–ఉష, జీవీఎంసీ ఏఈ

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద ఇటీవల జరిగిన వాసు హత్య కేసులో నిందితుడు పవన్‌ను మల్కాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ విద్యాసాగర్ స్టేషన్‌లో సోమవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వెంకన్నపాలెంలో వరలక్ష్మి అనే మహిళ నివసించేవారు. ఆమె ఈ నెల 3న చనిపోవడంతో బంధువులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అనంతరం అదే రోజు సాయంత్రం ఆమె ఆస్తి కోసం తగాదా జరిగింది. ఈ గొడవలో మృతురాలి తమ్ముడు వాసుపై దొండపర్తి ప్రాంతానికి చెందిన మరో తమ్ముడి కుమారుడు పవన్ దాడి చేశాడు. ఈ దాడిలో సిమెంట్ దిమ్మకు వాసు తల తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేపట్టి పవన్‌ను అరెస్ట్ చేశారు.

మాదిగ జాతి ఉనికి చాటుకోవాలి

సింధియా : ఎస్సీ వర్గీకరణ సాధించి ఈ నెల 11న విశాఖపట్నం వస్తున్న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికి మాదిగ జాతి ఉనికి చాటుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కింతాడ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో అరుంధతి సేవ సంఘం ఆధ్వర్యంలో అనపర్తి సైదా సుదర్శన్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వర్గీకరణ సాధకుడు మందకృష్ణ మాదిగను ఈ నెల 11న విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సత్కరించనున్నామని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ముప్పిడి వెంకటగిరి, పెద్దాడ వెంకటరమణ, అందం నీలారావు, ఏడిద నూకరాజు, చిట్టి అశోక్, బుంగ రాజు పాల్గొన్నారు.

హైవేలో కారు బోల్తా



ప్రమాదంలో బోల్తా పడిన కారు

మర్రిపాలెం : ఎన్ఏడీ కూడలి నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఓ కారు కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెందుర్తి ప్రాంతానికి చెందిన జ్యోష్న సోమవారం ఎన్ఏడీ జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై నగరంలోకి వెళ్తున్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదానికి గురైన లివిష్ ఏ1 షాపింగ్ మాల్

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ ఎదురుగా గల లివిష్ ఏ1 ఫ్యాషన్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు పెదగంట్యాడ ఏడీఎఫ్‌వో ఎస్.గోపీకృష్ణ తెలిపారు. సుమారు రూ.20 లక్షల ఆస్తిని నష్టం వాటిల్లకుండా కాపాడమన్నారు. అర్ధరాత్రి సమయంలో షాపింగ్ మాల్ యజమాని జి.ప్రమీల అగ్ని ప్రమాదంపై సమాచారం అందజేశారన్నారు. సమాచారం అందుకున్న వెంటనే తమ సిబ్బంది ఎల్ఎఫ్ ఎం.సోమినాయుడు, డ్రైవర్ ఆపరేటర్ జి.రమేష్, ఫైర్‌మెన్‌లు ఆర్.నాయుడు, ఎస్.రాజేష్, హెచ్‌డీ జే.శ్రీనివాసరావులతో కూడిన బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదంలో ఫర్నిచర్, సీలింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్, టోటల్ గ్రోసరీస్, కంప్యూటర్స్, ఎయిర్ కండీషన్, వంటివి పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు.

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం



వనితా వాకర్స్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న అపరంజి

మురళీనగర్ : ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవడం ద్వారా ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని మురళీనగర్ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (శాంతిధామం) ఇన్‌ఛార్జి అపరంజి సూచించారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. వనితా వాకర్స్ క్లబ్ మహిళలు నిర్వహిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ – 101 పూర్వ గవర్నర్ యు.శుభ, కార్యదర్శి ఎం.జయ, జాలీవాకర్ ఎం.ప్రమీలారావు, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఏక్తా పర్వ్ క్లస్టర్ పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సింధియా : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి, వారిలో ఐక్యతా భావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి రాష్ట్ర స్థాయి ఏక్తా పర్వ్ క్లస్టర్ పోటీలు దోహదపడతాయని కేంద్రీయ విద్యాలయం – 2 ప్రధానోపాధ్యాయుడు కె.సూర్యప్రకాష్ రావు అన్నారు. ఈ మేరకు పారిశ్రామిక ప్రాంతం నౌసేబాగ్ కేంద్రీయ విద్యాలయం – 2లో సోమవారం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు పాటలు, నృతాలు, థియేటర్ మైమ్, సాంప్రదాయ కథల ప్రసంగం, మోనో యాక్ట్, 2డీ, 3డీ కళలు, స్పాట్ పెయింటింగ్, వస్తు కళ ప్రదర్శన తయారీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి హాజరైన ప్రముఖులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. తదుపరి ప్రాంతీయ స్థాయి పోటీలు కొద్ది రోజుల్లో నిర్వహిస్తామని తెలిపారు.

రెల్లి జాతి వర్గీకరణపై చిన్న చూపు తగదు



కప్పరాడ ర్యాలీలో మాట్లాడుతున్న హర్యాల రాముడు, బంగారు సురేష్‌కుమార్

కంచరపాలెం : రెల్లి జాతి వర్గీకరణపై చిన్న చూపు తగదని ఉత్తరాంధ్ర రెల్లి కులాల సంఘం అధ్యక్షుడు హర్యాల రాముడు అన్నారు. ఈ మేరకు రెల్లి జాతి వారికి రిజర్వేషన్ శాతం పెంచాలని కోరుతూ జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి జైప్రకాష్‌నగర్ కప్పరాడ నుంచి విశాఖ కలెక్టరేట్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా కప్పరాడ కూడలి వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లి సామాజిక వర్గానికి చెందిన వారిలో విద్యావంతులు అనేక మంది ఉన్నారని, రిజర్వేషన్ లేక వారు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప చట్టసభల్లో ప్రాధాన్యత మాత్రం కల్పించడం లేదని వాపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారు సురేష్‌కుమార్ మాట్లాడుతూ రెల్లి జాతీయులకు కేంద్రం 1 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. బంగారి లక్ష్మీ నారాయణ, సురిపెల్లి మోహన్‌రావు, సోండి వెంకటరమణ, ఆకుల రాజు, మరియదాస్, సాయిపల్లి రాజు, రవీంద్రబాబు, మురళి, రజిత్ పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్కే అబ్దుల్ మారూఫ్, సిబ్బంది కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తమిళనాడుకు చెందిన సగుపార్ సతిక్, వై.రాజన్, ఎస్.అరుణాచలం, వరుణ్‌రాజ్ కన్నదాసన్ ఒడిశా నుంచి విశాఖ మీదుగా తిరుప్పూర్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వారి వద్ద ఉన్న 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, వారిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ ఎ.రవికుమార్ కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

శక్తి స్వరూపిణి.. అష్టసిద్ధి ప్రదాయిని

- మహాచండిగా అమ్మవారి దర్శనం
- మండపాల్లో విశేష హోమాలు, కుంకుమార్చనలు



సాయి మందిరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



చంద్రనగర్‌లో కుంకుమ పూజల్లో మహిళలు

గోపాలపట్నం : గోపాలపట్నం పరిధిలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలు, మండపాల్లో అమ్మవారు మహాచండీ మాతగా దర్శనమిచ్చారు. కొత్తపాలెం విజయదుర్గా దేవి ఆలయంలో అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. స్థానిక మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. చంద్రనగర్ గ్రౌండ్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మండపం చూపరులను ఆకట్టుకుంటోంది.

విశాఖ విద్య : దసరా నవరాత్రి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 52, 90వ వార్డుల పరిధిలో కరాస, శాంతినగర్ బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, కాకానినగర్, గవర వీధి వంటి చోట్ల ప్రత్యేక మండపాలపై దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మల్కాపురం : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం పారిశ్రామిక ప్రాంతంలోని మండపాల వద్ద దుర్గమ్మ తల్లిని మహాచండీ దేవి అవతారంలో అలంకరించారు. 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద డేరింగ్ అండ్ డేషింగ్ యూత్ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద విజయదుర్గా ఆలయంలో, ప్రకాష్‌నగర్ వద్ద దుర్గాదేవి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



విజయదుర్గా దేవి ఆలయంలో అమ్మవారు

పాలస్తీనాకు అండగా ఉందాం



ప్రదర్శనలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార: పాలస్తీనాకు అండగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఇతర వామపక్ష పార్టీల నాయకులు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయల్ మారణహోమం సృష్టించి ఏడాదైనా ఇంకా అక్కడ పరిస్థితులు మారలేదన్నారు. ఐక్యరాజ్య సమితి అక్కడ శాంతి నెలగొల్పాలని కోరారు. సోమవారం లలితా జ్యువలర్స్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు శాంతి ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, పైడిరాజు మాట్లాడుతూ ఇజ్రాయల్ దాడుల్లో జరిపి 42వేల మంది మృతి చెందారని, ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఖండించలేదన్నారు. అమెరికా అండదండలు చూసుకొని ఇజ్రాయల్ పేట్రేగిపోతోందని అక్కడ తక్షణమే శాంతిని నెలకొల్పాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ సీఎంవీఎస్ శర్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ నరసింగరావు, కె లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎస్.గోవిందరాజులు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

మురళీనగర్ : మురళీనగర్‌లోని మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు సోమవారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. శ్రీదేవి పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో నిరాశ్రయులైన 12 మందికి పార్కు అధ్యక్షుడు పి.సూర్యనారాయణ చేతుల మీదుగా సరకులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, అధ్యక్షుడు ఎస్.సీ తారామకృష్ణ, డి.వరప్రసాద్, పి.గిరిధర్, వై.తిరుమూర్తి, కేవీ వర్మ, పి.సంతోష్ కుమార్, పి.సతీష్‌కుమార్, టి.సూరిబాబు, బి.వెంకటేశ్వరరావు, పి.వెంకటరావు, పీఎస్ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుపయోగంగా దుకాణ సముదాయం



శ్మశాన వాటిక వద్ద నిరుపయోగంగా ఉన్న మాంసం, చేపల దుకాణాల సముదాయం



అధ్వానంగా తయారైన దుకాణాలు

గోపాలపట్నం: ప్రజల అవసరాలు, ఇష్టాలతో పని లేదు... ఇక్కడ నిర్మాణం చేపడితే ఏవిధంగా ఉంటుందన్న సమాలోచన లేదు... మా ఆధ్వర్యంలో ఒక నిర్మాణం చేపట్టామనిపించుకోవాలంతే... చేసేశారు. ఇప్పుడది నాయకులు, అధికారులు చేసిన నిధుల దుర్వినియోగానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. జీవీఎంసీ 91వ వార్డు శ్మశాన వాటిక వద్ద మాంసం, చేపల దుకాణ సముదాయం సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ నాటి నుంచి ఇప్పటి వరకు ఆ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రారంభించిన కొద్ది రోజులు అమ్మకాలు జరిపినా శ్మశాన వాటిక పక్కన ఉండడంతో కొనుగోలుదారులు రావడం లేదని మూసేశారు. దీంతో ఈ రెండు అంతస్తుల భవనం అప్పటి నుంచి నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. దిగువన ఉన్న స్టాల్లలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని చూసిన వారంతా ప్రజల సొమ్ము ఈ విధంగా వృథా చేస్తారా అంటూ వాపోతున్నారు. దీన్ని ప్రజలకు ఉపయోగపడేలా చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.



దుకాణాల వద్ద పేరుకుపోయిన చెత్త